క్లుప్తంగా

వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2024 జనవరి నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత విద్యార్హత ఉండాలని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీ://40.80.241.107/ఏపీవలంటీర్20/ఏపీవలంటీర్090420201049వీటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు వీఎంసీ వార్డు సెక్రటరీస్ స్పెషల్ సెల్ 81859 33187 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు శ్రీగోదా రంగనాథ స్వామి కల్యాణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ఆదివారం శ్రీ గోదా రంగనాథస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు పారాయణ మండలి వ్యవస్థాపక కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

వీఎంసీలో మరో ఐదు ప్రత్యేక కమిటీల ఏర్పాటు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ సెక్రటరీ సెల్‌లో సెక్రటరీ వసంతలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీకి మరో ఐదు ప్రత్యేక కమిటీ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యింది. పారిశుద్ధ్యం, ఆరోగ్యం ప్రత్యేక కమిటీకి చైర్‌పర్సన్‌గా 59వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ షహీనా సుల్తానా, డెప్యూటీ చైర్‌పర్సన్‌గా 35వ డివిజన్ కార్పొరేటర్ బలసాని మణిమ్మను నియమించారు. నగర సమగ్రాభివృద్ధి ప్రత్యేక కమిటీ చైర్మన్‌గా 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, డెప్యూటీ చైర్మన్‌గా 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత, ఆర్థిక, ఆడిట్ ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్‌గా 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మల కుమారి, వైస్ చైర్‌పర్సన్‌గా 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్యను నియమించారు. మహిళాభ్యుదయ ప్రత్యేక కమిటీ చైర్‌పర్సన్‌గా 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, వైస్ చైర్‌పర్సన్‌గా 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, విద్యా, సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేక కమిటీకి 32వ డివిజన్ చైర్మన్‌గా చన్నగిరి రామ్మోహనరావు, వైస్ చైర్మన్‌గా 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావును నియమించారు.

తల్లిపాలు అమృత తుల్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లిపాలు అమృత తుల్యం అని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. స్థానిక గులాబీతోట సచివాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె తల్లిపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండాయగుంట రాము, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మర్ తులసీచైతన్యకు అభినందన



విజయవాడస్పోర్ట్స్: ప్రపంచంలోని ఐదు జలసంధులను ఈదిన హెడ్‌కానిస్టేబుల్, అంతర్జాతీయ స్విమ్మర్ ఎం.తులసీచైతన్య సాహసం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. ప్రతిష్టాత్మకమైన ఐదు జల సంధులను ఈదిన చైతన్యను 'టెన్సింగ్ నార్కే నేషనల్ అడ్వెంచర్ అవార్డు'తో ఇటీవల కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సీపీ రాణా ఆయన కార్యాలయంలో తులసీచైతన్యను శుక్రవారం అభినందించారు. గిబ్రల్టర్, పాక్, ఇంగ్లీష్, బొడెన్సీ, కాటలీనా జలసంధులను ఈదిన తులసీచైతన్య పోలీస్ కమిషనరేట్ ఉద్యోగి కావడం గర్వంగా ఉందన్నారు. ఐదు జల సంధులను ఈదిన మొదటి ఇండియన్ పోలీస్‌గా రికార్డు సొంతం చేసుకున్నాడన్నారు. రాష్ట్ర, జిల్లా, విజయవాడ పోలీస్ కమిషనరేట్ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటడం సంతోషంగా ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

వ్యవసాయానికి పశుపోషణ తోడైతేనే గిట్టుబాటు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



లేగదూడపై నులిపురుగుల నివారణ మందు స్ప్రే చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): వ్యవసాయానికి పశుపోషణతోడైతేనే రైతులకు గిట్టుబాటు ఉంటుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కండ్రికలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యాన ఉచిత పశు వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు పోషకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే విష్ణు ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయం తర్వాత పశువుల పెంపకం ప్రధానంగా ఉంటుందని తెలిపారు. అయితే పశుపోషణలో మెలకువలతో రెట్టింపు ఆదాయం పొందవచ్చునని, ప్రధానంగా దూడల పెంపకంతో అనతికాలంలోనే పాడిరైతు నాలుగింతల ఆదాయం సంపాదించుకోవచ్చునని చెప్పారు. నాణ్యమైన దాణా అందిస్తూ క్రమం తప్పకుండా రోగనిరోధక టీకాలు వేయిస్తే, మేలు జాతి దూడల్ని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఏటా పశువులకు రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరో వైపు జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా పాడి రైతులకు రక్షణ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పాల సేకరణ, నాణ్యమైన పాల వినియోగ చట్టం -2023 తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. అమూల్ వచ్చిన తర్వాత ఏడు సార్లు పాల సేకరణ ధరలను పెంచడంతో లీటరుకు రూ. 10 నుంచి 20 వరకు పాడిరైతులు అదనంగా లబ్ధి పొందుతున్నారని వివరించారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్‌ను ఎమ్మెల్యే విష్ణు ఆవిష్కరించారు. అలాగే లేగదూడలకు అందాల పోటీలు నిర్వహించి, ఎంపికైన దూడలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపసంచాలకుడు డాక్టర్ వి.గోపీచంద్, సహాయ సంచాలకుడు డాక్టర్ డి.రాజశేఖర్, సిమన్ బ్యాంక్ గన్నవరం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, శ్రీరాములు, బ్యాంక్ ప్రెసిడెంట్ ఎం.రవీంద్ర రెడ్డి, పాలకేంద్రం ప్రెసిడెంట్ డి.మంగారెడ్డి, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మృతివనం వద్ద విద్యుద్దీకరణ పనులు పూర్తి చేయాలి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



స్మృతివనం వద్ద పనులను పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వరాజ్‌మైదానంలో అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం వద్ద విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేయాలని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు సిబ్బందిని ఆదేశించారు. అంబేడ్కర్ స్మృతివనం వద్ద జరుగుతున్న విద్యుత్ పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రోడ్డులో అడ్డుగా ఉన్న 33 కేవీ లైన్లను తొలగించాలన్నారు. తొలగింపు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. . కొత్తగా రిలీజ్ చేసిన హెచ్‌టీ సర్వీస్‌ను చెక్ చేశారు. ఆయన వెంట ఎస్‌ఈ ఏ.మురళీ మోహన్, టౌన్ ఈఈ బి.వి.సుధాకర్, ఏడీఈ పి. శ్రీధర్, ఏఈలు ఉన్నారు.

అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అల్లాహ్ దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాంబేకాలనీలోని ఆస్థాన ఎ గరీబ్ నవాజ్ అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా ఆశ్రమం 8వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలంటే వైఎస్సార్ కుటుంబానికి అమితమైన ప్రేమ అని అన్నారు. ఆ అల్లాహ్ దీవెనలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలంతా జగనన్న వెంటే నడుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ ఖాజా బాబా ఆశ్రమంలో జరిగే వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, 2024 ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించి జగనన్నకు బహుమతిగా అందిస్తామన్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, బెవర నారాయణ, పొదిగింటి నాగరాజు, షేక్ ఇస్మాయేల్ పాల్గొన్నారు.

ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి వివేకానంద

తెలుగు అకాడమీ చైర్ పర్సన్ డా.నందమూరి లక్ష్మీపార్వతి, కొమ్మినేని శ్రీనివాసరావు



పురస్కార గ్రహీతలతో నందమూరి లక్ష్మీపార్వతి, కొమ్మినేని శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన బోధనలతో ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి స్వామి వివేకానంద అని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ డా.నందమూరి లక్ష్మీపార్వతి, మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని హోటల్ ఐలాపురం కన్వెన్షన్ హాలులో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి. తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వేడుకల్లో పాల్గొన్నవారు మాట్లాడుతూ వివేకానంద బోధనలతో యువతను జాగృతం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. తన బోధనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచారని తెలిపారు. మాస్టర్ మోటివేటర్ బ్రదర్ షఫీ మాట్లాడుతూ యువత తమలో దాగివున్న నైపుణ్యాలను గుర్తెరిగి తద్వారా సామాజిక చైతన్యానికి, దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫిలంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 25 మందికి సంఘ మిత్ర జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, అద్దంకి రాజాయోనా, మీడియా అకాడమీ రాష్ట్ర కార్యదర్శి యం.బాలగంగాధర్ తిలక్, పుడమి సాహితీవేదిక అధ్యక్షుడు డా.చిలుముల బాల్‌రెడ్డి, సాహితీవేత్త కొల్లి రమావతి, డ్రీమ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మేదర సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో ..

పాయకాపురం(విజయవాడరూరల్): శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ నందు వివేకానంద జయంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుసేన్ పాల్గొని వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ప్రత్యేక చిన్నారులతో చేయూత సంస్థ సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక చిన్నారుల సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక చిన్నారులు భోగి మంటలు వేసి, కోలాటం నృత్యాలు చేస్తూ గాలిపటాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టీ కృష్ణకుమారి సంక్రాంతి విశిష్టతను వివరించారు. చిన్నారులు సంక్రాంతి సంబరాల్లో భాగంగా చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేక చిన్నారుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, ప్రత్యేక చిన్నారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

సుస్వరాల సంగీత దర్శకుడు సత్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రమాసత్యనారాయణ

విజయవాడ కల్చరల్: సుస్వరాల సంగీత దర్శకుడు చెళ్లపిళ్ల సత్యం అని డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో, జీఎస్ మెలోడీస్, మహేష్ కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత దర్శకుడు, సినిమా నిర్మాత సత్యం జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ సత్యం అనేక విజయవంతమైన చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించినట్లు తెలిపారు. విశ్వమాతా ఛారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ పండిత కుటుంబానికి చెందిన సత్యం తెలుగు, కన్నడ, మలయాళం తదితర భాషల సినిమాలకు సంగీత దర్శకత్వం వహించినట్లు చెప్పారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసానా రామన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ ఫీడర్ 11 కేవీ లైన్ మరమ్మతులు కారణంగా సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో డీఈ బీపీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ మెయిన్ రోడ్డు, లారీల బజార్, కృష్ణహోటల్ సెంటర్, వాటర్‌ట్యాంక్ రోడ్డు, యాడ్‌రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. కావున ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేఆర్‌జీ శేషుకుమార్‌కు అభినందనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఏపీ సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యాన ఏలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి 'సాహిత్య సంక్రాంతి సంబరాలు'లో అధ్యాపకుడు, విమర్శకుడు జీసీటీఏ నాయకుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్‌ను ఏపీ సాహిత్య అకాడమీ వారు ప్రశంసా పత్రం, నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా శుక్రవారం మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ శేషుకుమార్‌ను జీసీటీఏ నాయకులు ఎం.పద్మనాభం, లలితారెడ్డి, పి.శ్రీనివాస్, లైబ్రేరియన్స్ అసోసియేషన్ నాయకులు జి.లుముంబా, గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్స్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, శ్రీను తదితరులు అభినందించారు.

64వ డివిజన్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పాయకాపురం(విజయవాడరూరల్): వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం శుక్రవారం 64వ డివిజన్ లగడపాటి కమ్యూనిటీహాలు నందు జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ పాల్గొని డివిజన్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, పీఎం జనౌషధ పథకం, స్వచ్ఛ భారత్, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పీఎం జన్‌ధన్ వంటి పలు పథకాల గురించి తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఇన్‌చార్జి పల్లప రాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాసిద్, ఎస్‌డీటీ జగదీశ్వరి, సివిల్ సప్లయిస్ ఆర్ఐ శరత్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రా క్రికెట్ సంఘంపై కేసు డిస్మిస్

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలను సవాల్ చేస్తూ పలువురు వేసిన కేసును దేశ అత్యున్నత స్థానం శుక్రవారం తోసిపుచ్చిందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసోసియేషన్ ఎన్నికలపై స్టే విధించాలని కోరుతూ కబడ్డీ క్రీడాకారులు వీర్లంకయ్యతో పాటు పలువురు ఇటీవల సుప్రీం కోర్టును ఆశ్రయించారన్నారు. ఫిర్యాదుదారులు ఫిర్యాదులో పేర్కొన్న విషయాలను నిరాధారమైనవిగా న్యాయస్థానం పరిగణలోకి తీసుకుని కేసును డిస్మిస్ చేసిందన్నారు. ఇదే విషయంపై ఫిర్యాదుదారులు ఆరు నెలల క్రితం తొలుత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారని, ఈ నెల 5వ తేదీన హైకోర్టు ఈ కేసును కొట్టివేసిందని వారు పేర్కొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వాలి



శ్యాంప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వాలని దర్శకుడు రమాశంకర్ అన్నారు. మురుగా ఛారిటబుల్ సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో శుక్రవారం సీనియర్ గాయకుడు శ్యాంప్రసాద్‌కు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాశంకర్ మాట్లాడుతూ గాయనీ గాయకులకు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. సీనియర్ గాయకుడు డేవిడ్‌రాజు మాట్లాడుతూ మురుగా ఛారిటబుల్ సంస్థ సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభను చూపిన వారికి పురస్కారాలను ప్రదానం చేస్తోందని తెలిపారు. నిర్వాహకులు శ్యాంప్రసాద్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో స్వామివారికి పాయస నివేదన



శ్రీకల్యాణ రామాలయంలో స్వామివారు



బాబా మందిరంలో పూజలు చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు వైష్ణవ దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో 'కూడారై పాయస నివేదన' చేశారు. సర్వజనులు సుఖశాంతులతో వర్ధిల్లాలంటూ స్వామివారికి 108 గంగాళాలతో పాయసం నివేదన నిర్వహించారు.

శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో..

ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కూడారై నిర్వహించారు. 1500 లఘు గంగాళములతో స్వామివారికి పాయసం నివేదన చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను పారాయణ మండలి వ్యవస్థాపక కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

కోదండరామాలయంలో..

స్థానిక ముత్యాలంపాడు కోదండరామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన కూడారై పాయస నివేదన ఘనంగా జరిగింది. స్వామివారికి గోదాదేవి సమర్పించిన విధంగా 108 గంగాళాలతో పాయస నివేదన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మధురానగర్‌లో..

మధురానగర్ శ్రీభగవాన్ షిర్డీసాయిబాబా మందిరంలో శుక్రవారం మధురానగర్ శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన కూడారై జరిగింది. కార్యక్రమాలను మందిర కమిటీ సభ్యులు పీవీఎల్‌ఎస్ రాజు, ప్రసాద్, బాలవర్ధనరావు తదితరులు పర్యవేక్షించారు.

శ్రీకల్యాణ రామాలయంలో..

మధురానగర్ శ్రీకల్యాణ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన కూడారై జరిగింది. స్వామివారికి పాయసం నివేదన చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీకి మళ్లీ అధికారం ఖాయం

- విజయవాడ ఎంపీ కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి
- కార్మికవాడలో రూ.3.38 కోట్లతో వాటర్ ట్యాంక్ ప్రారంభం



కుళాయిని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి, అవినాష్ తదితరులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరిగిందని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని విజయవాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకులు కేశినేని శ్రీనివాస్ అలియాస్(నాని) స్పష్టం చేశారు. ఆటోనగర్‌లో రూ.3.38 కోట్లతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును శుక్రవారం ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నాని మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. జవహర్ ఆటోనగర్‌కు ఆసియా ఖండంలో గొప్పపేరు ఉందన్నారు. గతంలో ఆటోనగర్ అప్రోచ్ రోడ్డుకు తన ఇంటి ముందు స్థలం రెండు ఎకరాలు బాండ్ లేకుండా ఉచితంగా ఇచ్చానన్నారు. పార్టీలో చేరిన వెంటనే తనకు ఎంపీ సీటు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అవినాష్‌ను ఎమ్మెల్యేగా, ఎంపీగా తనను వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

శరవేగంగా నగరాభివృద్ధి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ నగరాన్ని శరవేగంగా అభివృద్ధి చేసేందుకు గాను రూ.కోట్లాది డబ్బును హెచ్చించామని మేయర్ భాగ్యలక్ష్మి చెప్పారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో నగరం బాగా అభివృద్ధి చెందిందన్నారు. తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు.

గత ప్రభుత్వం నీరు ఇవ్వలేదు..

కార్మికవాడ ఏర్పడి 40 ఏళ్లు అవుతున్నప్పటికీ తాగునీటికి నోచుకోలేదని.. దీనికి అంతటికి చంద్రబాబు పుణ్యమేనని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇక్కడ ఉన్న అన్ని కార్మిక సంఘాల నాయకత్వంలో ఎంపీ కేశినేని నాని సహకారంతో ఆటోనగర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంపీ నిధులు, ఐలా నిధులతో సుమారు రూ.3.38 కోట్లతో నీటి ట్యాంక్‌ను నిర్మించారన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని 7 నియోజవర్గాలతో పాటు ఎంపీ సీట్‌ను గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ నానిని సన్మానించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఐలా మాజీ చైర్మన్ ఎస్ దుర్గాప్రసాద్, ఓల్డ్ ఐరన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల ప్రసాద్‌రెడ్డి, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, విజయవాడ క్లస్టర్ ఫైనాన్స్ డైరెక్టర్ బాయన బాబూజీ, ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు, డిస్పోజల్ మోటార్స్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌస్‌ఖాన్, గ్యాస్ వెల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్ణ, 11వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పర్వతనేని బాబి పాల్గొన్నారు.

లయోలాలో ముగిసిన స్ఫూర్తి వేడుకలు



భోగి మంట వేసి వేడుకలను ప్రారంభించిన అధ్యాపకులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో సంక్రాంతి వేడుకలు

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని లయోలా కళాశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న స్ఫూర్తి కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. విద్యార్థులకు డిబేట్, వక్తృత్వం, వ్యాస రచన, సమూహ చర్చ, క్విజ్ సాహిత్య పోటీలు, పోస్టర్ మేకింగ్, కార్టూనింగ్, స్పాట్ ఫోటోగ్రఫీ, మెహందీ, రంగోలి, సంగీతం- క్లాసికల్ డ్యాన్స్ (సోలో), వెస్ట్రన్ (సోలో), జానపద సమూహ నృత్యం, క్లాసికల్ వంటి లలిత కళలు గాత్రం (సోలో), వెస్ట్రన్ వోకల్(సోలో), థియేటర్ ఆర్ట్స్ - స్కిట్, మైమ్, మిమిక్రీ, స్టాండ్ అప్ కామెడీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ ఎం. కృష్ణకుమారి బహుమతులను అందించారు. మధ్యాహ్నం సెషన్‌లో సంప్రదాయ బ్యాండ్‌తో ఊరేగింపుతో సంక్రాంతి సంబరాలు ప్రారంభమవగా రంగవల్లులు, భోగి మంటలు, గాలిపటాలుతో విద్యార్థులు సంక్రాతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సగయరాజ్, ప్రిన్సిపాల్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్స్ కె.కిరణ్ కుమార్, ప్రభుదాస్, స్టూడెంట్ యాక్టివిటీస్ డీన్ డాక్టర్ ఎల్. సుభ, స్టాఫ్ కోఆర్డినేటర్లు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో సంక్రాంతి సంబరాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో గ్రామీణ వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో హోటల్ సిబ్బందితో పాటు, పలువురు కస్టమర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో హోటల్ జనరల్ మేనేజర్ విజయకృష్ణ, సేల్స్ మేనేజర్లు జిలానీ, పవన్, చీఫ్ ఇంజినీర్ వైకుంఠరావు, సుధాకర్, నాగబాబు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.